క్లుప్తంగా

రామాలయంలో హుండీ చోరీకి విఫలయత్నం


హుండీ తాళం చెవిని కోసిన ఆనవాళ్లు

కురిచేడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ కోదండ రామాలయం హుండీని దొంగలు పట్టపగలు చోరీ విఫలయత్నం చేశారు. రామాలయం బయట గేటు తాళం వేయక పోవడంతో దొంగ ఆలయంలోకి వెళ్లి హుండీని పక్కకు లాగి దానికి ఉన్న తాళాన్ని రంపంతో కోసే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో భక్తులు ఆలయానికి వెళ్లడంతో వారిని చూసి దొంగ పరారయ్యాడు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే దొంగ దొరికే అవకాశం ఉంది. గ్రామ నడిబొడ్డులో పట్టపగలు దొంగతనం జరగడంపై ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి దొంగను పట్టుకుని ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దీపావళి మందులు స్వాధీనం


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై శివబసవరాజు

త్రిపురాంతకం: గ్రామాల్లో దీపావళి మందులు అనుమతి లేకుండా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సీహెచ్ శివబసవరాజు హెచ్చరించారు. మండల పరిధి మేడపిలో దుకాణలను పోలీసులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఒక షాపులో రూ.5 వేల విలువైన దీపావళి మందులు అక్రమంగా నిల్వ ఉంచారని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు చందలూరు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు చందలూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 27వ తేదీన చీమకుర్తిలోని చీమకుర్తి పబ్లిక్ స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఏసీహెచ్ పవన్‌కుమార్, శివాజీ, నవజయంతి ఈ నెల 9,10వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్, పీడీ అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొదటి వారంలో పశుగణన


పశుగణన సర్వేపై సూచనలు ఇస్తున్న డాక్టర్ నాగుల్‌మీరా

పుల్లలచెరువు: వచ్చే నెల మొదటి వారంలో అఖిల భారత పశుసమగ్ర సర్వే చేపట్టబోతున్నామని, రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి నాగుల్‌మీరా అన్నారు. బుధవారం పశువైద్యాధికారి కార్యాలయంలో నట్టల నివారణ మందు పంపిణీ, పశుగణన అంశాలపై సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగుల్‌మీరా మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాలపై పశుగణన సర్వేకు సంబంధించిన యాప్ రాగానే మొదటి వారంలో పశుగణన సర్వే చేపడతామని, మండలంలోని ప్రతి గ్రామంలో పాడిరైతులు, జంతువుల యజమానుల ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. పశువులకు చేపట్టిన ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం ఈ నెలాఖరు నాటికి నూరుశాతం పూర్తి చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

యర్రగొండపాలెం: మండలంలోని పిల్లికుంట తండా హైవేపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ తండాకు చెందిన రమేష్ నాయక్ రోడ్డుపై వెళ్తున్న సమయంలో మాచర్ల వైపు నుంచి యర్రగొండపాలెం వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో రమేష్ చేయి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో క్షతగాత్రుడిని స్థానిక ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. అతని పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

పాఠశాలల్లో సమస్యలు పట్టవా?


1 నుంచి 5వ తరగతి వరకు ఒకే గదిలో ఉన్న విద్యార్థులు


పాఠశాల ఎదుట నేల బండలు ఇలా..

- అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- అరకొర వసతులతో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

పెద్దారవీడు: మండలంలో చాట్లమడ అగ్రహారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తగరతి వరకు 26 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పాఠాలు చెప్పేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. మరో ఉపాధ్యాయురాలు ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి సెలవులు పెట్టి పాఠశాలకు రావడం లేదు. ఐదు తరగతుల విద్యార్థుల నిర్వహణకు రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. అందులో ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒకే గదిలో 26 మంది విద్యార్థులను కుర్చోబెట్టి ఒకే ఉపాధ్యాయురాలు పాఠాలు చెబుతున్నారు. ఒక తరగతి విద్యార్థులకు పాఠాలు చెబుతుంటే మరో తరగతి విద్యార్థులు అల్లరి చేయడంతో పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

నాడు అలా.. నేడు ఇలా

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ శాతం పేద వర్గాలకు చెందిన పిల్లలే చదువుకుంటారు. అలాంటి పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా సకల హంగులు కల్పించాలనే సంకల్పంతో నాడు–నేడు కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసింది. నాడు–నేడు పథకం ద్వారా రెండో విడతలో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపరిచేందుకు నిధులు మంజూరు చేసింది. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి కోసం బోరు, చేతులు కడుక్కోవడానికి కుళాయిలను ఏర్పాటు చేశారు. పాఠశాల ముందు భాగంలో కొంత ప్రదేశంలో నేలకు బండలు వేశారు. కానీ సిమెంట్‌తో జాయింట్లు వేయకుండా, ప్రహరీ నిర్మించకుండానే పనులు ఆగిపోయాయి. ఈ లోపు ఎన్నికలు రావడంతో పాఠశాల అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో కూటమి ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి చేసేందుకు నిధులు నిలిపివేశారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించక పోవడంతో తరగతి గది తలుపులు, నీటి కుళాయిలను పగలకొట్టడం, రాత్రిపూట మద్యం తాగటం, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఉపాధ్యాయులు, గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదింటి బిడ్డలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తోంది. నాడు–నేడు అభివృద్ధి పనులను నీరు గార్చింది. నిధులు విడుదల చేయక పోవడంతో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడవి అక్కడే నిలిచిపోయాయి. ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


దుండగులు పగలగొట్టిన పాఠశాల గది తలుపు

మద్యం తాగి ఖాళీ సీసాలు అక్కడే వేస్తున్నారు



పాఠశాలలో రాత్రిపూట స్థానికులు కొందరు మద్యం తాగి అక్కడే సీసాలు వేయడంతో పాటు అశుభ్రం చేస్తున్నారు. ఉదయం పూట పిల్లలు వచ్చి వాటిని తొలగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఒక తరగతి గది నిర్వహించడంతో ఒకే గదిలో ఒకే ఉపాధ్యాయురాలితో పిల్లలు చదువుకోవడం ఇబ్బందిగా ఉంది. ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లా. పాఠశాలలో స్థానికులు మద్యం తాగుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశా. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

– బూస వెంకటేశ్వర్లు, విద్యా కమిటీ చైర్మన్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ రామారావు

దర్శి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ రామారావు అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మాస్టర్స్ కళాశాలలో ఈవ్‌టీజింగ్‌కు వ్యతిరేకంగా బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ రామారావు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. అమ్మాయిలపై అఘాయిత్యాలకు పాల్పడుతూ వారిని ప్రేమ పేరుతో మోసం చేస్తూ తల్లిదండ్రులకు, కుటుంబాలకు చెడ్డ పేరు తీసుకురావడమే కాకుండా వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆ వైపుగా విద్యార్థులు పయనించవద్దని హితవు పలికారు. ఎస్సై మురళి మాట్లాడుతూ యువత మొదటగా చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. ఒక లక్ష్యం ఎంచుకుని ఆ వైపు పయనించాలన్నారు. అమ్మాయిలను ఈవ్ టీజింగ్ చేయడం, చెడు వ్యసనాలకు బానిసలవడం చేస్తే కటకటాల పాలవడం తప్ప ఒరిగేదేమీ లేదన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి, జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజి యాదవ్, నాయకులు స్టాలిన్, ఎం.రమేష్‌బాబు, జూపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

పుల్లలచెరువు: మండలంలో శుక్రవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నామని, అదే రోజు నూరుశాతం పంపిణీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వసంతరావు నాయక్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో మొత్తం 7734 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నారని, సచివాలయ సిబ్బంది అదే రోజు నూరుశాతం పంపిణీ అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పంపిణీ చేయాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి


మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో ఇందిర అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ పాలెం పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, విద్యార్థుల నోట్‌పుస్తకాలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వం ఇచ్చిన శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పటికప్పుడు వచ్చే మార్పులకు అనుగుణంగా బోధన చేయాలని చెప్పారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారికి నాణ్యమైన విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు, ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

బెల్ట్ షాపుపై దాడి

- 11 మద్యం బాటిళ్ల స్వాధీనం



మద్యం బాటిళ్లతో ఎస్సై మహేష్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గుంటూరు రహదారిలో మెయిన్ రోడ్డులో ఉన్న కూల్‌డ్రింక్ షాపుపై ఎస్సై మహేష్ బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కూల్ డ్రింక్ షాపులో విక్రయానికి సిద్ధంగా ఉన్న 11 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తాళ్లూరు: 25 శాతం రాయితీతో శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ ప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని బొద్దికూరపాడు రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పాస్ పుస్తకం, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాలలోని వీఏఏల వద్ద రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలు పొంది మంచి లాభాలు వచ్చే పంటలు వేయాలని కోరారు. వీఏఏలు అజ్మీర్, సుష్మ, సుల్తానా, రైతులు పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): వరి, కంది పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ రైతులకు సూచించారు. మండలంలోని వేముల, వేములబండ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ వరి పంటలో అగ్గితెగులు, పాము పొడ తెగులు గుర్తించామన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసెక్లోజోల్ 75 శాతం, 120 గ్రాములు ఎకరాకు లేదా ఐసోప్రోథియోలిన్ 40 శాతం 300 మి.లీ ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. పాముపొడ తెగులు నివారణకు హెక్సాకోనజోల్ 5 శాతం 400 మి.లీ ఎకరాకు, వాలి డామైసిన్ 3 శాతం 400 మిలీ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్జల ఆదెమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.తిప్పేస్వామి, ఎంపీఈఓ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలో సాగు చేసిన కంది, పత్తి, మిరప, వరి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి పి. మధుబాబు తెలిపారు. మండలంలోని నమశ్శివాయపురం, పెద్దవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి పంటలో ప్రస్తుతం ఉల్లికోడు పురుగు ఆశించి ఉందని, ఇది నారుమడి దశ నుంచి పిలక దశ వరకు నష్ట పరుస్తుందన్నారు. అంకురం ఉల్లికాడలా పొడుగాటి గొట్టంగా మారి బయటకు వస్తుందన్నారు. దీని నివారణకు నాటిన 10–15 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోల చొప్పున వాడాలన్నారు. అలాగే దుబ్బు దశలో ఉన్నప్పుడు పై పాటుగా క్లోరిఫైరిఫాస్ 20 శాతం మందు 400 మిలీ లేదా ఫిప్రోనిల్ 5 శాతం మందు 400 మిలీ లేదా ల్యాంబ్డాసైహేలోత్రిన్ 5 శాతం సీఎస్ మందు 200 మిలీ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


ముండ్లమూరు: మాట్లాడుతున్న ఏఓ ఫరూక్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చింతల, బోడేనాయక్ తండాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ పాల్గొన్నారు. చింతల, బోడేనాయక్ తండాల్లో సాగు చేసిన మిర్చి, పత్తి పొలాలను క్షేత్ర పరిశీలన చేశారు. దీంతో పాటు ప్రధాన మంత్రి పసల్ బీమా, కౌలు రైతు కార్డ్, పీఎం కిసాన్ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ పరిపూర్ణ, రాజయ్య, హనుమంతు, కాశయ్య, హనిమీబాయి, రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలను పండించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజరాణి అన్నారు. మండల పరిధిలో గొబ్బూరు, దేవరాజుగట్టు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాల గురించి వివరించారు. కంది, పత్తి, పొగాకు, మినుము, శనగ సాగు పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్లు, యాజమాన్య పద్ధతులు తెలిపారు. వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి మాట్లాడుతూ సాగులో పంటల మార్పిడి పద్ధతి పాటించాలని, తద్వారా అధిక ప్రయోజనాలు పొందొచ్చన్నారు. ప్రతి సారి ఒకే రకమైన పంటను వేయకుండా తరుచూ పంటల మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని, రైతులు ఈ దిశగా ప్రయత్నించాలని తెలిపారు. పశుసంవర్థక శాఖకు చెందిన డాక్టర్ బాలునాయక్, వీఏఏలు విజయలక్ష్మి, చిన్నా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, వి.కాశిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు


గాయపడిన బాలూనాయక్

పెద్దదోర్నాల: వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం.. ఎదురుగా బైకును ఢీకొనటంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కర్నూల్, గుంటూరు ప్రధాన రహదారిలోని మోట్ల మల్లికార్జునపురం వద్ద తీగలేరు వంతెనపై బుధవారం రాత్రి జరిగింది. ప్రమాదంలో బైకుపై ఉన్న నల్లగుంట్లకు చెందిన దంపతులు దేశావత్ బాలూనాయక్, సీతాబాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల కథనం ప్రకారం.. నల్లగుంట్ల చెందిన దంపతులు మండల కేంద్రంలో వ్యక్తిగత పనులు ముగించుకుని స్వగ్రామం వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారులు క్షతగాత్రులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసారావుపేటకు రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


సీతాబాయి..

అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి: దీపావళి పండగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దీపావళి మందుల కౌంటర్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మందుల స్టాల్స్ వద్ద డ్రమ్ముల్లో నీరు, షాపు షాపునకు మధ్య గ్యాప్ ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యుత్ లైటింగ్‌లు ఏర్పాటు చేసి ఎటువంటి అగ్నిప్రమాదాలు జరగకుండా అందరికీ కౌన్సిలింగ్‌లు కూడా ఇచ్చామన్నారు. అందరూ నివాసాల వద్ద కూడా మందులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీఐ రామారావు, ఎస్సై మురళి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేద్యపు కుంటలు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న శ్యాంసస్

దొనకొండ: ప్రతి గ్రామంలో రైతులు సేద్యపు కుంటలు ఏర్పాటు చేసుకోవాలని క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి ఉపాధి సిబ్బందికి సూచించారు. స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి నీరు నిల్వ ఉండటానికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. రైతులకు మంజూరైన మొక్కలను వారి పొలాల్లో నాటించాలని, అలాగే గేదెలకు మంజూరైన వాటర్ షెడ్‌లను పూర్తి చేయాలని తెలిపారు. కొత్తగా గ్రామాల్లో నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి సిబ్బంది గ్రామాల్లోని ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కోర్స్ డైరెక్టర్ శ్యాంసస్, ఏపీఓ టి.దేవయ్య, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్


ముండ్లమూరులో గ్యాస్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

త్రిపురాంతకం: ప్రభుత్వం దీపావళి పండగ నుంచి ప్రవేశ పెడుతున్న ఉచిత గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. స్థానిక త్రిపుర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో బుధవారం వినియోగదారులకు ఉచిత గ్యాస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా దీపం–2 పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు అందజేస్తారని తెలిపారు. దీపావళి నుంచి మార్చి వరకు తొలి సిలెండర్‌ను పొందవచ్చని, ఈ నేపథ్యంలో వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పాత విధానంలో సిలిండర్ బుక్ చేసుకోవచ్చని, డెలివరీ అయ్యాక 48 గంటల్లోపు సిలిండర్‌కు చెల్లించిన నగదు బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. సాంకేతిక కారణాలతో నగదు జమ కాకుంటే సచివాలయం వద్దకు వెళ్లి సరి చేయించుకోవాలని సూచించారు. ఆర్ఐ ముకుంద హరి, గ్యాస్ ఏజెన్సీ యజమాని ఎంబీ గురవారెడ్డి, మేనేజర్ వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): దీపం పథకం కింద అర్హులకు సిలిండర్‌లు ఇవ్వాలని తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ ఆదేశించారు. స్థానిక భారత్ గ్యాస్ ఏజెన్సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. గ్యాస్ గోడౌన్‌లో ఉన్న స్టాక్ వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ దీపం పథకం కింద ప్రతి సంవత్సరం వచ్చే మూడు సిలిండర్‌లు లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఎవరికైనా సిలిండర్‌లు ఇవ్వకుంటే ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. డీటీ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

తాగునీటి బోరు, ట్యాంక్ ప్రారంభం


మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చప్పల్లి కనకదుర్గ

పెద్దారవీడు: ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి బోరు, ట్యాంక్‌ను దాత అమెరికా దేశం స్కాట్ కామ్‌పెన్, ఎంపీడీఓ జాన్‌సుందరం బుధవారం ప్రారంభించారు. మండలంలో కలనూతల ఎస్సీ కాలనీలో జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ సొసైటీ ఆధ్వర్యంలో విదేశీ దాత అమెరికా దేశం స్కాట్ కామ్‌పెన్ ఆర్థిక సాయంతో బోరు, మోటారు, ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మార్కాపురం ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, హైదరాబాద్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జి.నారాయణరావు 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. హైదరాబాద్ రాబర్ట్ ఎ.జోసఫ్, జేఎల్ఎం సొసైటీ ట్రెజరర్ సునితారుత్‌బెన్ని, కో ఆర్డినేటర్ ఎంఎస్ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ సింగాఏసన్న, బుట్టి దిలీప్‌కుమార్, భూతలపాటి సాల్మన్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.